# ఎప్పటికి మోక్షం?

శ్రీ వేదుల కామేశ్వరరావు

మానవుడు ఆవులించి చిటికేసిన మోస్తరుగా విశ్రాంతికోసం ఒళ్ళు విరుచుకొంటూ పదిగంటలు కొట్టింది గోడగడియారం. ఆఫీసుగది అంత నిశ్శబ్దంగావుంది. అందుకు కారణం అంతక్రితం ఆ ఆఫీసు గొడవగా వుండటమే. మేనేజరు లావుగా, పొడవుగా, పెద్దరాగిబిందంత బొజ్జ కప్పడానికి తొడుక్కొన్న బుష్‌కోటు, చేతిలో బెత్తమూ చూచి లేడిపిల్లలలాగ హడలిపోతూ గుమాస్తాలందరూ వాళ్ళ వాళ్ళ పనుల్లో నిమగ్నులైపోతున్నారు. బంట్రోతులు తలపాగాలు చుట్టి కాగితాలు త్రిప్పుతున్నారు. ఒకవైపున కుర్చీ, టేబిలూవున్నాయి. టేబిలుమీద ఫైల్సు కట్టలుగా కట్టి కుప్పలుగా పోయబడివున్నాయి. వాటిముందు నీరసంగా కూర్చొన్నాడు శేషాచలం. క్లర్కు పోస్టులో ప్రవేశించిన తరువాత ఎప్పుడూ పనిని గురించి విసుగు చెందేవాడు కాదు శేషాచలం. కాని ఈ నాడు తనికి ఆ ఫైల్సు చూస్తే కళ్లు తిరిగి పోతున్నాయి. కాగితాలు చూస్తుంటే బుర్ర వేడెక్కి పోతోంది. కాని, ఏంచేస్తాడు? తప్పదు.

లోపల్నుంచి వస్తున్న విచారాన్ని ఒక్కసారి అణచుకొన్నాడు. తనకు మంచి భార్య దొరకడంవల్ల జీవితంలో కొంతైనా మాధుర్యం కన్పించేది. కాని ఇప్పుడు అదీ లేదు. అవును. ఎలావుంటుంది? ఎంతమంచి హృదయమైనా ఇంటి పరిస్థితుల్ని చూస్తే ఆవేదన చెందదూ? భర్తయొక్క పరిస్థితి తెలుసుకొన్న భార్యకనుక, తాను కాపురానికి వచ్చిన పదేళ్ళనుంచీ ఎప్పుడూ "ఈ వస్తువు కావాలి" అని అడుగలేదు శాంత. ఉన్న దాంట్లోనే జాగ్రత్తగ సర్దుకోగలిగిన, ఆరితేరిన చేయి కనుక చలాన్ని సుఖపెట్టగలిగేది శాంత. ఇన్నాళ్ళకి . ఇప్పుడు పాల డబ్బా అయిపోయింది...ఇంట్లో కూరలేదు" అని అనగలిగింది శాంత దీనంగా. ఆ మాత్రం దానికే చలం హృదయం చివుక్కుమంది.

"ఇంకా జీతాలురాలేదు" అన్నాడు చలం ఇంకాదీనంగా.

"ఎక్కడైనా అప్పు తెచ్చుకోండి" అని వెళ్ళిపోయింది శాంత.

అసలు కూరలేకపోతే పప్పుపులుసు కాచి కాలక్షేపం చేసే శాంత ఈ నాడు కూరకోసం ప్రత్యేకంగాఅడగటం మర్యాద కోసమే. సాగీ సాగని జీవితాలలో చుట్టాల బాధ వొకటి!

ఆలోచిస్తున్నాడు చలం. గడియారం తిరిగి పోతోంది. బంట్రోతు వచ్చి సంతకాల కోసం నిలబడ్డాడు. చలం సంతకం చేశాడు.

..."ఈ గుమాస్తాల జీవితాలు ఇంత అధోగతిలో ఉండటానికి కారణం ఏమిటి? పెళ్ళాం, పిల్లల్ని పోషించలేని ఉద్యోగం ఎందుకు? రచయితలందరూ గుమాస్తాల మీద వ్యాసాలువ్రాసినా గుమాస్తాల జీవితాలకు మార్పు లేదేం? గుమాస్తాల జీవితాలకు ఎప్పటికి మోక్షం?"... ఆలోచిస్తున్నాడు చలం.

"బియ్యం లేకపోతే ఫరవాలేదులెండి. కాస్త గంజి త్రాగుదాం"

"ఇదిగో, ఈ బంగారం అమ్మి సరుకులుకొని తెండి"

"నాకు చీరెలకు తొందరలేదు. మీకు పంచెలన్నీ చిరిగిపోయాయి. రెండు పంచెలు కొనుక్కోండి"

"నేను సినీమాకు రాను, ఆ డబ్బులుంటే రేపు కూరైనా వస్తుంది"

...భార్య మాటలన్నీ చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి. కళ్లు మూసుకొన్నాడు. కాని చెవులు మూసుకొంటాయా? భార్యని మరొకసారి మెచ్చుకొన్నాడు. కాని ఏమి లాభం? ఇప్పటి కామెకొక్క చీరైనా తన చేతులతో కొనలేకపోయాడు. నాలుగేళ్ళక్రితం పెళ్ళిలో వచ్చిన చీరలలోవే రెండు మిగిలితే, వాటితోనే గడుపుతోంది. ఇదివరకొక చీరకొంటే కొట్లో తిరిగి ఇప్పించివేసింది. ఆమెస్థితి తల్చుకొని కన్నీళ్ళు కార్చాడు.

"ప్రపంచంలో ఎంతోమందివున్నారు. ఆగర్భ శ్రీమంతులైన వాళ్ళకు ఎప్పుడూ ఏమీ లోటులేదు. నిరుపేదల కసలు 'లేద' నే పదంకూడా లేదు, ని ఈ గుమాస్తా వర్గానికి చెందిన వారికే ఈ పాట్లన్నీ. అటు మేనేజరు చూస్తే సిల్కు బుష్కోటు, ఫ్యూన్ చూస్తే తెగమాసిన నిక్కరు. తనుకూడా మేనేజరుతో సమానంగా వెయ్యాలి డ్రెస్సు. బజారులో కూరలు కొంటే కూలీకావాలి. తను మోస్తే ప్రపంచం నవ్వుతుంది. అవును ప్రపంచం నవ్వితే మనం మొయ్యడానికేం? ఎదురు ప్రశ్న వేసింది మనస్సు. అబ్బ పని మానేసి ఇదేంగొడవ? అనుకొంటూ పని ప్రారంభించాడు చలం.

ఇంతలోనే బంట్రోతు వెంకన్న ఒక కాగితం తెచ్చి ఇచ్చాడు. దానిమీద జీతాలు ఇంకారావనీ మేనేజరు వ్రాసిన కొంకి వ్రాత ఉంది.

"అద్దెయివ్వండి చలంగారూ! ప్రతీ నెలా ఇంత ఆలశ్యమైతే యిలాగు? ఇవ్వాళ ఇస్తానన్నారు. మర్యాదగలవాడివని ఊరుకొంటున్నా" — షావుకారు

"క్రిందటి నెలా, ఈనెలా కలిపి నలభై రూపాయలయిందండి. గేదెను కొనుక్కోవాలని చెప్పానుగదండి. వారం రోజుల

నుంచి త్రిప్పుతున్నారు.'' పాలమనిషి.
''ఇప్పటికి నెల్లాళ్లు బట్టి అడుగుతున్నా. ఇంకా ఇవ్వలేదండి బాబుగోరూ. వేనోళ్ళం. మమ్మల్నిలా బాధపెడితే ఎల్లాగండీ? తెల్పినోళ్ళు'' — పుల్లలమనిషి.

''ఇప్పటికి అరువు చిల్లరవాడకం ఏభై రూపాయిలయింది. ఇప్పించండి''–కిరాణా మర్చెంట్.

''పాలడబ్బా, కూరగాయలూ తెప్పించారా'' అర్థాంగి.

...అందరూ ఆ కాగితంలో దూరి రణగోణి ధ్వని చేస్తున్నారు. ఎంతమందికని సమాధానం చెప్తాడు? ఏమని చెప్తాడు?

బంట్రోతు మళ్లీవచ్చి, ఏదో సంతకం చేయాలంటూ చెప్పి వెళ్ళాడు. చలం చూశాడు. అది ఆఫీస్ ఛక్కు. 100 రూపాయిలు తీసుకురావడానికి కాబోలు మేనేజరుపంపాడు. అది చూడగానే చలానికేదో ఆలోచనల పరంపర కలిగింది. గుటక వేశాడు. నోరూరుంది కాని లాభంలేదు. ''ఎప్పటికి మోక్షం?''అని మనస్సు ప్రశ్నించింది బాధగా. సాయంకాలంవరకూ ఆలోచించాడు. దారీ తెన్నూ కన్పించలేదు. వెళ్ళి మేనేజరుని ప్రాధేయపడదామని లేచి నిలిబడ్డాడు. ఇంతలో మేనేజరే వచ్చాడు తనవైపు.

''సార్!'' అన్నాడు చలం.

''ఏం?'' గర్జించాడు మేనేజరు.

''ఈ నెల ఇంట్లో......—''

''ఇంట్లోనూలేదు; వంట్లోనూలేదు. నీకేదో బుర్రలో ప్రవేశించింది. నీకు ఈ నాటినుండి ఇక్కడకు రావలసినపని తగ్గింది. నిన్ను డిస్మిస్ చేశాను.''

''అడిగినందుకే డిస్మిస్సాసార్!''

''కాదు ఇదిగో ఛక్. దీనిమీద ''ఎప్పటికి మోక్షం'' అని వ్రాశావు. ఇంకా ఏవో గీతలు పెట్టావు. నీ జీతం ఇందులో కట్ చేశాం వెళ్లు. రేపట్నుంచి నీవు రావద్దు'' అంటూ విసురుగా వెళ్ళిపోయాడు మేనేజర్. గుమాస్తాలందరూ కళ్లు వప్పజెప్పి చూస్తున్నారు. గుమ్మాలు దిగి బైట పడ్డాడు చలం.

..........షావుకారు, పాలవాడు, పుల్లలవాడు, కిరాణా మర్చెంటూ, అర్థాంగీ, ...అందరూ చేతులు చాపుకు వస్తున్నారు వారిని గెంటుకొంటూ చలం ముందుకు వెడుతున్నాడు, ''ఎప్పటికి మోక్షం?'' అంటూ ప్రక్కనున్న పిల్లగాలులు చెవులలో దూరి పోరుతున్నాయి.